నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, బుధవారం 10 ఏప్రిల్ 2024 HYDERABAD



## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి

అంబర్‌పేట్‌లోని క్రౌన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి టి.పద్మారావు గౌడ్, మాజీ హోంమంత్రి మహమూద్ అలీ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు విజయ్‌కుమార్ గౌడ్, పద్మా వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పద్మారెడ్డి, మైనారిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు



## డబుల్ ఇండ్లలోకి గృహప్రవేశం చేయించండి

జగద్గిరిగుట్ట, ఏప్రిల్ 9 : కేటాయించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్లను వినియోగంలోకి తీసుకురావాలని జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన పలువురు లబ్ధిదారులు మంగళవారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసి విన్నవించారు. ఇప్పుడే ప్రవేశాలకు అవకాశం కల్పిస్తే.. అదే ప్రాంతంలో ఉన్న స్కూళ్లు, కాలేజీల్లో తమ పిల్లలకు అడ్మిషన్లు తీసుకోవడానికి వీలవుతుందని తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవచూపుతానని ఎమ్మెల్యే వారికి హామీఇచ్చారు.

# గెలుపే లక్ష్యం

మేడ్చల్, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ): అత్యంత కీలకమైన మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ అడుగులు వేస్తున్నది. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాల్లో గెలుపొందిన ధీమాతో వ్యూహాలు రచిస్తున్నది. దీనికి తోడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తానని ఇచ్చిన అన్ని హామీలు అమలుకు నోచుకోకపోవడంతో కాంగ్రెస్ పార్టీపై ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. అయితే ఇదే అవకాశాన్ని అదనుగా భావిస్తున్న బీఆర్‌ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో నిర్వహిస్తున్న సన్నాహక సమావేశాలలో కాంగ్రెస్ పార్టీ తీరును ఎండగట్టి ప్రజల్లోకి తీసుకువెళ్లడమే ధ్యేయంగా పెట్టుకున్నది. ఇందులో భాగంగా బీఆర్‌ఎస్ శ్రేణులకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో సహా ఎమ్మెల్యేలు చామకూర మల్లారెడ్డి, కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డిలు తమ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీపై ఎదురు దాడి చేస్తున్నారు. సిట్టింగ్ ఎంపీ రేవంత్ రెడ్డి మల్కాజిగిరి నుంచి ఎన్నికై నియోజకవర్గానికి ఎలాంటి మంచి చేయలేదని విమర్శిస్తూ తమ ప్రచారానికి పదును పెంచుతున్నారు.


> 7 అసెంబ్లీ స్థానాల్లో గెలుపొందిన ధీమాతో గులాబీ దళం ముందడుగు
>
> మల్కాజిగిరి స్థానాన్ని కైవసం చేసుకునేలా బీఆర్ ఎస్ వ్యూహం

### రాగిడికి అదే ప్లస్

అసెంబ్లీ ఎన్నికల్లో నగరవాసులంతా బీఆర్‌ఎస్ వైపే మొగ్గుచూపడం అదే ట్రెండ్ ఈ ఎంపీ ఎన్నికల్లో కూడా కొనసాగనుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ హయాంలోనే నగరంలోఅన్ని విధాలా అభివృద్ధి జరిగిందని.. ఇదే అంశం పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి అనుకూలంగా మారనుందని ఎమ్మెల్యేలు పేర్కొంటున్నారు. 7 నియోజకవర్గాలలో కాంగ్రెస్, బీజేపీ పార్టీల కంటే అసెంబ్లీ ఎన్నికల్లో మూడున్నర లక్షల పైచిలుకు ఓట్లు బీఆర్‌ఎస్ పార్టీకి వచ్చిన విషయం తెలిసిందే

### ఉపందుకున్న బీఆర్‌ఎస్ ప్రచారం

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రచారం ఉపందుకున్నది. మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్‌లలో ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు నియోజకవర్గాలలో బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ప్రచారం ఉధృతంగా కొనసాగిస్తున్నారు. మరోవైపు మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీకి బలమైన ప్రాతినిధ్యం లేకపోవడంతో ఆ పార్టీకి కొంత ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. అంతేకాక మల్కాజిగిరి పార్లమెంట్ పరిధికి సంబంధం లేని అభ్యర్థి అయిన సునీతామహేందర్ రెడ్డికి కాంగ్రెస్ టికెట్ కేటాయించడంతో ఆ పార్టీకి మరింత సంకటంగా మారింది.




### నేడు మేడిపల్లిలో..
### సన్నాహక సమావేశం

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు(బుధవారం) మేడిపల్లిలో బీఆర్‌ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, చామకూర మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి హాజరు కానున్నారు.



అల్వాల్ సర్కిల్ వెంకటాపురం డివిజన్ యాదమ్మనగర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్(మాజీ ఐపీఎస్)ను సన్మానిస్తున్న ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

# కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను చిత్తుగా ఓడిస్తాం

**నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్**

మల్కాజిగిరి, ఏప్రిల్ 9: కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థులను చిత్తుగా ఓడిస్తామని బీఆర్‌ఎస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అల్వాల్ సర్కిల్ వెంకటాపురం డివిజన్ యాదమ్మనగర్‌లో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు పర్చడంలో విఫలమైందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల సమస్యలను పట్టించుకోకుండా బీఆర్‌ఎస్ పార్టీపైన తప్పుడు ఆరోపణలు చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మరని, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి తప్పు చేశామని ప్రజలు అంటున్నారని చెప్పారు. మల్కాజిగిరి ఎంపీగా రేవంత్ రెడ్డి గెలిచిన తర్వాత ప్రజలను పట్టించుకోలేదని విమర్శించారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ సబితాకిశోర్, అనిల్‌కిశోర్, ప్రభాకర్, శివ, రాజు, బచ్చల స్వామి, చంద్రశేఖర్, సురేష్, బాబు పాల్గొన్నారు.

# క్యాబ్స్‌లో ఏసీ బంద్




**డ్రైవర్లకు, ప్రయాణికులకు మధ్య గొడవలు**

**ధరలు గిట్టుబాటు కావడం లేదని డ్రైవర్ల వాదన**

**ప్రభుత్వం ధరలు నిర్ణయించాలని డిమాండ్**

సిటీబ్యూరో, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ) : ఓ వైపు ఎండలు మండుతున్నాయి. మరోవైపు నగరంలో సరిపడా ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉండటం లేదు. ఈ పరిస్థితుల్లో చాలా మంది నగరవాసులు, ఉద్యోగులు, దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు క్యాబ్ సేవలను వినియోగించుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో వారికి రైడ్ ధరలు అధికంగా చూపించినప్పటికీ రైడ్‌ను కస్టమర్స్ ఓకే చేస్తున్నారు. అయితే లొకేషన్‌కు వచ్చిన క్యాబ్‌లలో డ్రైవర్లు ఏసీ సదుపాయం కల్పించడం లేదు. ఇదేమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తే.. గిట్టుబాటు కావడం లేదని ఏసీ బంద్ చేశామని చెబుతున్నారు. ఈ పరిస్థితిపై డ్రైవర్లకు, ప్రయాణికులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంటుంది. నగరంలో ఇలాంటి ఘటనలు అధికంగా జరుగుతుండటంతో క్యాబ్ సంఘాలన్నీ తమ యాప్ అగ్రిగేటర్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అగ్రిగేటర్స్ తమ కమీషన్ తగ్గించుకొని డ్రైవర్లకు సరైన ధరలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

### 'నో ఏసీ' క్యాంపెయిన్ ప్రారంభం

వాహనాల్లో ఏసీ వినియోగిస్తే కిలో మీటర్‌కు రూ.16-18 వరకు భారం పడుతుంది. ఈ పరిస్థితుల్లో ఓలా, ఉబర్, ర్యాపిడో సంస్థలు కమీషన్స్ ఆపుకొని కిలో మీటర్‌కు రూ.10-12 మాత్రమే చెల్లిస్తుందని డ్రైవర్లు వాపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నష్టపోతూ ఎలా క్యాబ్‌ల్లో ఏసీ ఆన్ చేస్తామని క్యాబ్ డ్రైవర్ సంపత్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం స్పందించి కిలో మీటర్‌కు సరైన ధరలు నిర్ణయించేల యాప్ అగ్రిగేటర్స్‌పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ క్యాబ్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే నగరంలో 'నో ఏసీ' క్యాంపెయిన్ ప్రారంభించామని తెలిపారు.



జవహర్ నగర్ డంపింగ్ యార్డులో విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

# వ్యర్థాలతో వెలుగులు

**జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో 20 మెగావాట్ల ప్లాంటు ఇప్పటికే అందుబాటులోకి**

**కొత్తగా మరో 14.5 మెగావాట్లు**

**వేస్ట్ టు ఎనర్జీ పై సరికొత్త ఫలితాలను అందించిన కేసీఆర్ సర్కారు**

సిటీబ్యూరో, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ) : వ్యర్థాల నుంచి వెలుగులు ప్రసరింపజేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లలో మరొకటి అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో 20 మెగావాట్ల ప్లాంటు అందుబాటులోకి రాగా.. తాజాగా దుండిగల్‌లో 14.5 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ప్లాంటును వినియోగంలోకి తీసుకువచ్చారు. వ్యర్థాల నుంచి సంపదను సృష్టించాలని కేసీఆర్ పభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను చేపట్టింది. దుండిగల్‌లో జీహెచ్‌ఎంసీ చేపట్టిన ఈ ప్లాంటుతో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల సామర్థ్యం 34.5 మెగావాట్లకు చేరుకున్నది. అంతేకాకుండా కేసీఆర్ సర్కారు ముందుచూపుతో చేపట్టిన పవర్ ప్రాజెక్టులు మరో నాలుగు ఈ ఏడాది చివరి నాటికల్లా అందుబాటులోకి వచ్చి సామర్థ్యం ఏకంగా 101 మెగావాట్లకు చేరుకోనుండడం గమనార్హం. కాగా చెత్త నుంచి కరెంటును ఉత్పత్తి చేసే వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను ఒక్కొక్కటిగా అందుబాటులోకి తీసుకువచ్చి వ్యర్థాల నుంచి సంపదను సృష్టిస్తున్నది. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను సెకండరీ కలెక్షన్, ట్రాన్స్‌ఫర్ పాయింట్స్ (ఎస్‌సీటీపీ) నుంచి వ్యర్థాలను జవహర్‌నగర్ డంప్ యార్డుకు తరలిస్తారు. తరలించిన వెంటనే అక్కడ యాంత్రికంగా సెగ్రిగేట్ చేసిన తర్వాత మండే గుణం గల వ్యర్థాలను వేరు చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తారు. తద్వారా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటుకు ఆ చెత్తను తరలించి కరెంటును ఉత్పత్తి చేస్తారు. ఇందులో భాగంగా ఇప్పటికే జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో 20 మెగావాట్ల సామర్థ్యంతో ప్లాంటు అందుబాటులోకి వచ్చింది. తాజాగా దుండిగల్‌లో రోజుకు 1500 టన్నుల చెత్త ద్వారా 800 టన్నుల ఆర్‌డీఎఫ్ (రెఫ్యూజ్ డిరైవ్‌డ్ ఫ్యూయల్) ఉత్పత్తి చేసి 14.5 మెగావాట్ల కరెంట్‌ను వినియోగంలోకి తీసుకువస్తున్నారు. తర్వాతి దశలో జవహర్‌నగర్ ఫేజ్-2, ప్యారానగర్, యాచారం, బీబీ నగర్‌లో ఎనర్జీ ప్లాంటును అందుబాటులోకి తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు వేగిరం చేశారు.



2020 అక్టోబర్ నెలలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, తదితరులు



గత సెప్టెంబర్ నెలలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించి పనితీరును తెలుసుకుంటున్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, తదితరులు

# చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేద్దాం

### కాసాని గెలుపునకు సైనికుల్లా పనిచేద్దాం

**చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య**

**బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన 200 మంది బీఎస్పీ నాయకులు**

**పాల్గొన్న ఎంపీ అభ్యర్థి కాసాని, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్**

షాబాద్, ఏప్రిల్ 9 : పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. సోమవారం రాత్రి చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ సమావేశంలో ఎమ్మెల్యే యాదయ్య, బీఆర్‌ఎస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సమక్షంలో సుమారు 200 మంది బీఎస్పీ కార్యకర్తలు గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ 14 ఏండ్లు సుదీర్ఘ పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని చెప్పారు. పదేళ్ల కాలంలో తెలంగాణలో అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన వారికి భవిష్యత్తులో మంచి అవకాశాలు వస్తాయని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా బీఆర్‌ఎస్ నుంచి బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌కు పార్టీ అధినేత కేసీఆర్ అవకాశం ఇచ్చారని, అందరం కలిసికట్టుగా పని చేసి చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 13న చేవెళ్లలో జరుగనున్న కేసీఆర్ సభను విజయవంతం చేయాలని కోరారు.

### ఆశీర్వదించండి : అభ్యర్థి కాసాని

బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ... చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా తనకు కేసీఆర్ అవకాశం ఇచ్చారని, మీరందరూ తనను ఆశీర్వదించాలని కోరారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం గత 40 ఏండ్లుగా తనవంతుగా కృషి చేస్తున్నానని తెలిపారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### పార్టీ వీడిన వారికి గుణపాఠం చెప్పాలి : మెతుకు ఆనంద్

వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ మాట్లాడుతూ...పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో అండగా నిలిచిన వారికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీలో పదవులు అనుభవించి బయటకు వెళ్లిన వారికి ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుకోసం అందరూ కష్టపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, మాజీ ఎంపీపీ మంగలి బాల్‌రాజ్, ఆయా నియోజకవర్గాల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, వేదికపై బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

### గండిపేట కాండ్యూట్‌పై 5 వర్టికల్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు!

**ఇప్పటికే కోకాపేట్‌లో అమలు**

**వచ్చే నెలాఖరు నాటికల్లా అన్ని అందుబాటులోకి తెచ్చే ప్లాన్**

సిటీబ్యూరో, ఏప్రిల్ 9 (నమస్తే తెలంగాణ) : ఈ ఏడాది వేసవి ప్రారంభంలోనే నగరంలో వాటర్ ట్యాంకర్ మహాప్రభో అంటూ 31వేల మంది వినియోగదారులు ఆధారపడిన పరిస్థితి. ఈ నేపథ్యంలో వాటర్ ట్యాంకర్ డిమాండ్ తగ్గింపుతో పాటు అక్కడక్కడ ఎదురవుతున్న నీటి కొరతను అధిగమించేందుకు జలమండలి కీలక నిర్ణయం తీసుకుంది. మణికొండ, పుప్పాలగూడ, కోకాపేట, నార్సింగి, షేక్‌పేటలో నీటి సమస్యకు చెక్ పెడుతూ వర్టికల్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. గండిపేట కాండ్యూట్ మీద ఇప్పటికే కోకాపేట వద్ద 3 ఎంఎల్‌డీ సామర్థ్యం గల వర్టికల్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను అందుబాటులోకి తెచ్చారు. తర్వాతి క్రమంలో మణికొండ, పుప్పాలగూడ వద్ద తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు వేగిరం చేశారు. వచ్చే నెలాఖరు నాటికల్లా డిమాండ్ దృష్ట్యా గండిపేట కాండ్యూట్ పై ఐదు ప్లాంట్లను అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు తెలిపారు.